ప్రజాశక్తి
గురువారం 3 ఆగస్టు 2023 5
శ్రీ సత్యసాయి



నేడు చంద్రబాబు నాయుడు పర్యటన

హంద్రీనీవా, కియా, గొల్లపల్లి రిజర్వాయర్ పరిశీలన



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. రాయలసీమ ప్రాజెక్టుల పరిశీలన చేపట్టిన ఆయన గురువారం నాడు హంద్రీనీవా ప్రాజెక్టు పరిశీలనను చేపట్టనున్నారు. కడప పర్యటన ముగించుకుని బుధవారం రాత్రికి అనంతపురం నగరం చేరుకున్నారు. మెట్టుగోవిందరెడ్డి ఫంక్షన్ హాలులో బస చేసిన ఆయన గురువారం ఉదయం 9.30 గంటలకు అక్కడి నుంచి యాత్రను ప్రారంభిస్తారు. ఎంవైఆర్ ఫంక్షన్ హాలు నుంచి ఆత్మకూరు మండలంలోని సింగనగుట్ట వద్దనున్న రెండో పంప్‌హౌస్ పరిశీలిస్తారు. ఆ తరువాత అప్పర్ పెన్నార్ ప్రాజెక్టును పరిశీలిస్తారు. అనంతరం 11.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు కియా పరిశ్రమ వద్దకు చేరుకుంటారు. కియా పరిశీలన అనంతరం గొల్లపల్లి రిజర్వాయరు సందర్శించారు. అనంతరం దుద్దేబండ మీదుగా పాలసముద్రం, గోరంట్ల, ఓడిసి మీదుగా కదిరికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటారు. రాత్రికి అక్కడ బసచేస్తారు.

జిల్లాలోకి హంద్రీనీవా నీటి పంపింగ్ (ఫైల్ ఫోటో)





హంద్రీనీవా ఎవరి ఘనత..?

◆ అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న మాటల యుద్ధం ◆ హంద్రీనీవా ప్రాజెక్టు పరిశీలనతో రాజుకున్న పొలిటికల్ హీట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టులపై అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలోనే ప్రాజెక్టుల పరిశీలనను ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు చేపట్టిన రాయలసీమ యాత్ర మరింత రాజకీయ వేడిని రాజేస్తోంది. తమ హయాంలో ప్రాజెక్టులు చేపట్టామంటే తమ హయాంలో అని సవాళ్లు విరుసుకుంటున్నారు. ప్రాజెక్టులు సాధించిన ఘనత తమదంటే తమదని మాటల యుద్ధాన్ని సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమ అత్యంత దుర్భిక్ష ప్రాంతానికి ఎవరి హయంలో ఏ మేరకు పనులు సాగాయన్నది రేఖమాత్రంగా పరిశీలిద్దాం

దుర్భిక్ష ప్రాంతాలుగానున్న రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చే నిమిత్తం సర్ అర్థార్ కాటన్ హయాంలో హంద్రీనీవా అన్న ఆలోచన పుట్టింది. 1980 తరువాత ఎన్టీ.రామారావు ముఖ్యమంత్రిగానున్న సమయంలో ప్రాజెక్టు రూపకల్పనకు అవసరమైన ప్రణాళికకు తొలి అడుగు పడింది. అయితే ప్రాజెక్టు పనులు చేపట్టే దశకు చేరుకోలేదు. 1996లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అయ్యాక 11 మార్చి 1996లో తొలిసారిగా దీనికి శంకస్థాపన చేశారు. కాని పనులు ప్రారంభమవలేదు. 1999లో మరోమారు ఆయనే శంకుస్థాపన చేశారు. అప్పుడు కూడా పనులు మొదలవ్వలేదు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2005లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2006లో రెండో దశకు శంకస్థాపన చేశారు. అప్పటి నుంచే పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. సంపూర్తిగా ఈ పనులు ఇప్పటికీ పూర్తవలేదు. వస్తున్న డిమాండ్ల ఆధారంగా పనులను పెంచుకుంటూ పోతూనే ఉన్నారు.

2012 నుంచి హంద్రీనీవా నీళ్లు

2005వ సంవత్సరం నుంచి పనులు ప్రారంభమైనప్పటికీ 2012లో తొలిదశ పనులు పూర్తయ్యాయి. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగానున్న సమయంలో 2012లో ట్రయల్‌రన్ జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏటా శ్రీశైలం నుంచి అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా నీరుస్తోంది. కరువు పరిస్థితుల్లోనూ తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు తోడు ఈ నీరు రావడంతో జిల్లా సాగు, తాగునీటి అవసరాలు కొంత మేరకు తీరుతున్నాయి. అయితే ఈప్రాజెక్టును మరింత విస్తరించాలన్న డిమాండ్ వస్తూనే ఉంది. ఎందుకంటే ప్రారంభంలో చేపట్టిన 40 టిఎసిల సామర్థ్యం మేరకు నీటిని తీసుకోలేని పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువల వెడల్పునకు డిమాండ్ ఉంది. ఈ ప్రభుత్వం వెడల్పు చేస్తున్నట్టు ప్రకటించినా పనులు మాత్రం ప్రారంభించలేదు.

ఆయా ప్రభుత్వాల హయాంలో కేటాయింపులు ఇలా...

సంవత్సరాలు	అధికారంలో ఉన్న పార్టీ	నిధుల కేటాయింపులు (కోట్లలో)
1991-1995	కాంగ్రెసు పార్టీ	2..50
1995-2004	టిడిపి	21.22
2004-2009	కాంగ్రెసు	3156.89
2009-2014	కాంగ్రెసు	3153
2014-2019	టిడిపి	5625.25
2019-2023	వైసిపి (ప్రస్తుతం)	1926.07



గడువు ముగిసిన ఆహార పదార్థాలను చూపుతున్న యువకులు

గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయం

ఫిర్యాదు చేసిన యువకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయాన్ని యువకులు అడ్డుకున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత మంది స్వార్థపరులు గడువు ముగిసిన ఆహార పదార్థాలను బెంగుళూరు నుంచి నుంచి టన్నుల కొద్దీ హిందూపురానికి తీసుకొచ్చి వాటిలో గడువు ముగిసిన తేదిని ఇంకా ఉన్నట్లు చిత్రికరించి, బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ వ్యహరాలు హిందూపురం పరిసర ప్రాంతాలలో ఎక్కువగా జరుగుతున్నాయి. పట్టణంలోని పులపమతి రోడ్డులో శ్రీకంఠపురం వద్ద ఒక గోడాన్‌లో గడువు ముగిసిన ఆహార పదార్థాల ప్యాకెట్లపై ఇంకా గడువు ఉన్నట్లు ప్రింట్ చేసి, బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీనిని గమనించిన యువకులు రవితేజా రెడ్డి, నాగేష్ స్వామి, భాస్కర్, శ్రీనివాస్, బద్రి తదితరులు బుధవారం అక్కడి వెళ్లి పరిశీలించారు. వెంటనే ఆహార భద్రత అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు స్పందించక పోవడంతో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్‌కు ఫిర్యాదు చేశారు. అందరు కలిసి కల్తీ ఆహార పదార్థాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతు హిందూపురం ప్రాంతంలో ఇలాంటి కల్తీ ఆహార పదార్థాలను కల్తీ వ్యాపారులు ఎక్కువగా విక్రయిస్తున్నప్పటికి ఆహార భద్రత శాఖ అధికారుల్లో కనీస చలనం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి, ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

విరివిగా మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

75వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీలలో నా భూమి నా కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ ఆగస్టు 15వ తేదీ నాటికి 75 మొక్కలు నాటే విధంగా కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా జగనన్న కాలనీలలో పూర్తి అయినా గహాల దగ్గర ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసే విధంగా హౌసింగ్ అధికారులు, ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, హౌసింగ్ అధికారులు,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లకలకపై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్: ప్రస్తుతం పాఠశాల విద్యార్థులలో చిన్న పిల్లలకు ఎక్కువగా కళ్లకలక వస్తుందని దీంతో భయపడనవసరం లేదని జిల్లా అంధత్వ నివారణ సంస్థ డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. ఇది గాలి ద్వారా నీటి ద్వారా చేతుల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. కళ్లకలక వచ్చినప్పుడు కళ్లు ఎర్రబడడం, నీరు కారడం, పుసి కట్టడం, కనురెప్పలు వాపు రావడం, దురద మంట రావడం వంటి లక్షణాలుంటాయని, తెలిపారు. కళ్లకలక వచ్చినవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా చల్లని నీటితో కళ్లను శుభ్రపరచుకోవాలని, నీలం కంటి అద్దాలు వాడాలని, ఉతికిన రుమాలను వాడాలని, దగ్గరలో ఉన్న కంటి వైద్య నిపుణులు సంప్రదించి యాంటిబయాటిక్ కంటి చుక్కల మందులను ఉపయోగిస్తే కంటి కలక నయమవుతుందని తెలిపారు.

ఖాళీబిందెలతో నిరసన

మడకశిర : పట్టణంలోని చౌటిపల్లి ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై కాలనీ మహిళలు మున్సిపల్ ఆఫీస్ ఎదుట ఖాళీబిందెలతో బుధవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలో తీవ్ర తాగు నీటి ఎద్దడి నెలకొందన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే వీధిదీపాలు, రోడ్డు సమస్య నెలకొందన్నారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. వీరి ఆందోళనకు సిపిఎం రామాంజనేయులు, సిపిఐ పవిత్ర మద్దతు పలికారు. కాలనీవాసుల సమస్యపై మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు రత్నమ్మ, అక్కమ్మ, శివమ్మ, రామాంజమ్మ, భాగ్యమ్మ, ముత్తమ్మ, నరసమ్మ, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు

ప్రజాశక్తి - పరిగి

మండల వ్యాప్తంగా మట్టి అక్రమ తరలింపు మూడు పూలు ఆరుకాయలుగా జరుగుతోంది. అధికారుల కన్నుగప్పి రాత్రి వేళల్లో ఈ వ్యవహారాలు నిర్వహిస్తుండటంతో అధికారులు కూడా ఏం చేయలేని స్థితిలో ఉన్నారు. గత కొన్ని నెలలుగా పరిగి మండల వ్యాప్తంగా ఎమిగోస్ ప్రైవేట్ కంపెనీ వ్యక్తులు ఈ ప్రాంతంలో ఇసుక తరలింపునకు రాయల్టీ వసూలు చేస్తుండటంతో మట్టి మాఫియా దార్లకు ఇబ్బందిగా ఏర్పడినప్పటికీ ఒకచోట అనుమతి తీసుకునే మరోచోట యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. రెండు రోజుల క్రితం కోడిగెనహళ్లికి చెందిన మట్టి అక్రమ తరలింపుదారుడు 224-2 సర్వే నెంబరులో అనుమతులు తీసుకుని ప్రభుత్వ స్థలంలో మట్టిని తరలిస్తుండగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు రావడంతో జెసిబిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు అప్పచెప్పారు. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు మట్టి తరలింపు వ్యవహారంపై ఇటు ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అనుమతితోనే మట్టిని తరలించే విధంగా ఎమ్మిగోస్ ప్రైవేట్ నిర్వాహకులకు ఆదేశించారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో మట్టిని తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.ఈ మేరకు అధికారులు మట్టి అక్రమ తరలింపు పై బుధవారం విచారణ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి విరివిగా మొక్కలు నాటి పరిరక్షించాలని గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ ఆర్. శంకర్ నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో గ్రీన్ భారత్ బృందసభ్యులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెట్లు లేకుంటే మానవ మనుగడ కష్టమవుతుందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. అనంతరం పాఠశాల పిల్లలకు వారి ఇంటి పరిసరాలలో నాటుకోవడానికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రసాద్, గ్రీన్ భారత్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బి. వెంకటరత్నం, వెల్ఫేర్ డైరెక్టర్ సుధారాణి, ఉపాధ్యాయులు సురేష్, రమణ నాయక్ పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్ గడువును పొడగిస్తు రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు రైల్వే అధికారులు సోమప్ప, శ్రీకాంత్, ఆనంద్ తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతు గతంలో రిజర్వేషన్ కౌంటర్ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుండి 6 గంటల వరకు పని చేసేదన్నారు. తాజా ఉత్తర్వుల మేరకు రిజర్వేషన్ కౌంటర్ గురువారం నుండి ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. దీనిని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజలను మభ్య పెట్టేందుకే చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన

ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రజలను మభ్య పెట్టేందుకే టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల సందర్శన చేపడుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ విమర్శించారు. బుధవారం మండలంలోని దుద్దేబండ పంచాయతీ చంద్రగిరి గొల్లపల్లి గ్రామాలలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ ఛైర్పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్య ప్రకాశ్ రెడ్డి ఎమ్మెల్యే శంకర్నారాయణకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్నారాయణ మాట్లాడుతూ చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ అనుకూల మీడియా తో కలిసి ప్రజలను మోసం చేసేందుకు ప్రాజెక్టుల సందర్శన పేరుతో వస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మభ్యపెట్టి తప్పు దారి పట్టిచ్చి జగనన్న ప్రభుత్వం పై బురదజల్లే కార్యక్రమాలను చేస్తున్నాయని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులు చూడాలని ఆలోచన కుట్రపూరితమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, సర్పంచి గౌతమి శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్య ప్రకాష్ రెడ్డి, మండల కన్వీనర్ నాగులూరు బాబు, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, జయశంకర్ రెడ్డి, కౌన్సిలర్లు రఘునాథ రెడ్డి, బోయ బాబు, గణేష్,నాయకులు సోమశేఖర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, మంజునాథ్ , సుధాకర్ రెడ్డి,చెన్నకేశవ,కొండల రాయుడు,శ్యామ్ నాయక్,శంకర్ రెడ్డి, బుల్లెట్ బాబు, నాగేనాయక్, వెంకటరత్నం,సుబ్బారెడ్డి,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు,వైసిపి నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తికి రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ రాక

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం పుట్టపర్తికి రానున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదలైంది. కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం చిత్తూరు జిల్లా కుప్పంలో పలు కార్యక్రమాలలో పాల్గొని రాత్రికి పుట్టపర్తి చేరుకుంటారన్నారు. ప్రశాంతి నిలయం శాంతి భవన్ లో బస చేసి శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్ లో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. వ్యవసాయ రంగం సంస్కరణల పై జరిగే సదస్సులో ఆయన పాల్గొంటారు. సిఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుంది. సదస్సు అనంతరం మధ్యాహ్నం ఇక్కడ నుంచి అనంతపురాని వెళతారు. సదస్సుకు సంబంధిత అధికారులందరూ హాజరు కావాలని ఈసందర్భంగా కలెక్టర్ కోరారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి -పెనుకొండ

చంద్రబాబు నాయుడు గురువారం పెనుకొండ మండలంలోని కియా కార్ల పరిశ్రమ,గొల్లపల్లి రిజర్వాయర్ పర్యటన సందర్భంగా పోలీసు భద్రత ఏర్పాట్లను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్పీ.మాధవ్ రెడ్డి బుధవారం పరిశీలించారు. బందోబస్తులో భాగంగా పోలీసులు తీసుకోవలసిన జాగ్రత్తలు, భద్రత ఏర్పాట్లను సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ హుసేన్ పీరా, పెనుకొండ సిఐ కరుణాకర్, కియా ఎస్ఐ వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రిజర్వాయర్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు : జేసీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయాల సిబ్బందిని జాయింట్ కలెక్టర్ టి ఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి మొదటి అంగనవాడి కేంద్రం, రెండవ సచివాలయాన్ని జెసి తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో ఇప్పటివరకు ఆన్ లైన్ లో నమోదు చేసిన 3386 దరఖాస్తులకు సంబంధించి వివిధ సర్వీసుల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా సిబ్బంది పని చేయాలన్నారు. అంతకుముందు అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ వంశీకృష్ణ రెడ్డి, తహశీల్దార్ నవీన్ కుమార్, ఎంపీపీ రమణారెడ్డి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, సచివాలయ అడ్మిన్ సౌభాగ్య, కౌన్సిలర్లు, అంగనవాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

నియోజకవర్గంలోని మైనారిటీలకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్-2 గా షేక్ శంషాద్ బేగంను ఎంపిక చేయడం పట్ల పట్టణ మైనారిటీ నాయకులు బుధవారం కొత్తపేట ఉషోదయ స్కూల్ నుండి ఎమ్మెల్యే ఇంటి వరకు ఆటోలు, టూవీలర్లు, కార్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో మైనారిటీకి స్థానం కల్పించడం మాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను మైనారిటీ నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి అభివృద్ధికి మైనార్టీలు కృషి చేయాలని ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాచర్ల అంజి, కత్తె పెద్దన్న, బాల్ రెడ్డి, సుభాన్‌బాషా, కౌన్సిలర్లు ఎల్లయ్య, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గజ్జల శివ, మైనారిటీ నాయకులు అధిక సంఖ్యలో మైనార్టీలు పాల్గొన్నారు.

బిజెపి విద్వేష రాజకీయాలను ప్రతిఘటిద్దాం

ప్రజాశక్తి - పెనుకొండ

మణిపూర్ మారణకాండను ఖండించాలని బిజెపి విద్వేష రాజకీయాలను ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుండి పట్టణ పుర వీదుల గుండా ర్యాలీ నిర్వహించి బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలు సర్కిల్ లలో, ప్రభుత్వ కార్యాలయాల లో ఉద్యోగులకు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా సాగుతున్న నరమేధాన్ని దానికి మూల కారణమైన బిజెపి విద్వేష రాజకీయాలను ఖండిద్దామన్నారు. ఆడపడుచులను పోలీసుల సమక్షంలో మతోన్మాదులు నగ్నంగా ఊరేగించి వారిపై సామూహికంగా అత్యాచారలు తెగబడ్డారన్నారు. మారణకాండ పట్ల ప్రజానీకం ఆగ్రహానికి లోనైందని మూడు మాసాలుగా ఈ దారుణాలు సాగుతున్న ప్రధాని మోడీ నోరు విప్పలేదని విమర్శించారు. దీని వెనుక కార్పొరేట్ శక్తుల స్వార్ధపూరిత లాభాపేక్ష కూడా ఉందన్నారు. మణిపూర్ పర్వతాల్లో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లు కాజేయడానికి వీలుగా అక్కడ నివసించే కుక్కీ లను తరిమి వేయడానికి కుట్రలు పన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రమేష్, పార్టీ సభ్యులు తిప్పన్న, బాబావలి, గంగాధర్, మహబూబ్‌బాషా, వెంకటరాముడు, రాజు రావు, వజ్రంనాగప్ప, నరసింహులు, క్రిష్టప్ప, ఆటో యూనియన్ నాయకులు మూర్తి, హనుమంతు, రెడ్డప్ప, మహేష్, శ్రీరాములు,గంగయ్య ,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : మణిపూర్ రాష్ట్రంలో గత మూడు నెలలుగా సాగుతున్న నరమేధానికి సంబంధించిన కరపత్రాలను సిపిఐ నాయకులు కార్యకర్తలు బుధవారం మండలకేంద్రంలో పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాల వద్ద వీటిని పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్ కూడలిలో సిపిఎం నాయకులు గోవిందు తదితరులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో బిజెపి సాగిస్తున్న విద్వేష రాజకీయాలపై ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరి, హరి, సురేష్, రజాక్, గణేష్, అమర్, దస్తగిరి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మణిపూర్ లో జరుగుతున్న సంఘటనలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపార సముదాయాల వద్ద వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మణిపూర్ మారణకాండకు వ్యతిరేకంగా రూపొందించిన కరపత్రాలను మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సిపిఎం నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో సాగుతున్న నరమేధానికి మూల కారణమైన బిజెపి విద్వేష రాజకీయాల్ని ఎలిగెత్తి ఖండిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివన్న, వివి రమణ, ఎస్వీ రమణ, సిఐటియు నాయకులు ఒంటెద్దువేమన్న, శ్రీనివాసులు, నరసింహారెడ్డి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మణిపూర్ మారణకాండను ఖండిస్తూ బిజెపి విద్వేష రాజకీయాలను ప్రతిఘటించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున, సీనియర్ నాయకులు మెసేజ్ బాషా, సిఐటియు మండల అధ్యక్షులు ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలను వారు పంపిణీ చేశారు.

హిందూపురం : మణిపూర్ మారణకాండను ప్రజాస్వామ్య వాదులు ప్రతి ఒక్కరు ఖండించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప అన్నారు. ఆగష్టు 8న ఐద్వా ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ గోడపత్రికలను విడుదల చేశారు. మణిపూర్ లో జరిగే హింస పైన వేసిన కరపత్రాలను మహిళలు పనిచేసే గార్మెంట్స్ లో, ప్రభుత్వ కార్యాలయాల్లో అనేక రంగాల్లో పనిచేసే మహిళలకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, రామాంజప్ప, చంద్ర, బాబయ్య, ఈశ్వరమ్మ, జయమ్మ, లక్ష్మమ్మ, అశ్వర్ధమ్మ, రాము తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మణిపూర్ మరణకాండను ఖండిస్తూ సిపిఎం నాయకులు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, వెంకటేషులు, మాబు, గంగరాజు, ఎస్ చాంద్ బాషా, చంద్రశేఖర్, రామాంజనేయులు, ఓబులేసు, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



హిందూపురంలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఇందుకూరు ఘటనలో యువతి మృతి

ముదిగుబ్బ : మండల పరిధిలోని ఇందుకూరు గ్రామంలో మంగళవారం నాడు విషగుళికలు మింగి తల్లీకూతుళ్లు ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తల్లి లక్ష్మమ్మ(55) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె కూతురు పుష్పలత(20) బుధవారం ఉదయం అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కాగ లక్ష్మమ్మ కుమారుడు గత నెల 25వ తేదీన అతని ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుమారుడు మృతి చెందిన వారం రోజుల వ్యవధిలో తల్లీకూతుళ్ల ఇద్దరూ ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కుమారుడు మరణాన్ని తట్టుకోలేక వీరు ఆత్మహత్య చేసుకున్నారా.? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయన్న కోణంలో ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళకు ఆర్థికసాయం

కొత్తచెరువు : మండల పరిధిలోని వంగంపల్లి గ్రామంలో పూజారి మాధవ రాజు ఇంట్లో ఇటీవల జరిగిన గ్యాస్ ప్రమాదంలో ఆయన భార్య రాజేశ్వరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈమెను వైద్య చికిత్సలకు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతున్నారు. దీంతో సత్యసాయి జిల్లా సిపిఐ నాయకురాలు జయలక్ష్మి బాధిత మహిళ కుటుంబ సభ్యులకు కర్నూల్ హాస్పిటల్లో పదివేల రూపాయలను అందజేశారు. వీరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

క్షతగాత్రుడికి చేయూత

కొత్తచెరువు : మండలకేంద్రంలో వడ్డెర కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త పెయింటర్ నాగేష్ ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడ్డారు వైద్య చికిత్సలు తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. దీంతో వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి, యువ నాయకుడు చక్రధర్ రెడ్డి నాగేష్‌ను బుధవారం పరామర్శించారు ఆయనకు 10వేల రూపాయలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి లోచర్ల రాజారెడ్డి, వడ్డే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేతన్ననేస్తం వెంటనే విడుదల చేయాలి

ధర్మవరం టౌన్ : ప్రభుత్వం 12 రోజుల క్రితం నేతన్న నేస్తం కింద నిధులు మంజూరు చేసినా ఇంతవరకు ఓసీలకు చెందిన చేనేత కార్మికులకు జమకాలేదని కావున వెంటనే నేతన్ననేస్తం సొమ్ము విడుదలచేయాలని ఏపీ చేనేత కార్మికసంఘం తాలూకా కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. చేనేత రంగంలో అన్నివర్గాలకు చెందిన వారు జీవనం సాగిస్తున్నారన్నారు. నేతన్న నేస్తం విడుదలై 12 రోజులు కావస్తున్నా ఓసీలకు చెందిన నేత కార్మికులకు జమకాలేదని వెంటనే జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు

పాఠశాల ఆవరణలో కూలిన వృక్షం

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు తోపులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న 50 ఏళ్ల పైబడిన చింతచెట్టు నేలకొరిగింది. మంగళవారం సాయంత్రం వీచిన గాలీకి ఒక్కసారిగా చెట్టు పాఠశాల భవనంపై పడటంతో భవనం పాక్షికంగా దెబ్బతినింది.అయితే వక్షం నేలకొరిగే సమయంలో పాఠశాల తరగతులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

లేపాక్షి : మండల కేంద్రంలోని షాదీమహల్‌కు ప్రహరీ నిర్మాణానికి హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక వేణు బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించి తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, స్థానిక సర్పంచి ఆదినారాయణ, నారాయణస్వామి, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సిడిపిఒ రెడ్డి రమణమ్మ, డాక్టర్ రాజకుమార్, తహశీల్దార్ కాటంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

హిందూపురం : ఆశా వర్కర్ల సమస్యలపై ఈనెల 8న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా జయప్రదం చేయాలని ఎఐటియుసి నాయకులు కోరారు. బుధవారం రూరల్ మండలం చౌళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ విషయంపై వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు.

సమావేశాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి

బుక్కపట్నం : మండల వ్యాప్తంగా 30 యాక్ట్ నిబంధనలు అమల్లో ఉన్నందున సభలు సమావేశాలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ నరసింహుడు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఆగస్టు 31 తేదీ వరకు మండల వ్యాప్తంగా 30 యాక్ట్ నిబంధనలు అమల్లో ఉంటాయని చెప్పారు. పండుగలు సభలు సమావేశాలు నిర్వహించాలంటే పోలీసులు అనుమతి తప్పనిసరి అని తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య సూచించారు. బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి, జగరాజు పల్లి, అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, సూపర్ వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, సుస్మిత, ఆరోగ్య కార్యకర్తలు మంజుల వాణి, ప్రమీల, అంగనవాడీ కార్యకర్తలు విజయ లక్ష్మి, అరుణమ్మ , శంకరావతి, నాగ మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల

నల్లచెరువు : మండల పరిధిలోని శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి శ్రావణమాస బ్రహ్మోత్సవ వేడుకలకు సంబంధించిన గోడపత్రికలను స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్లచెరువు ఎంపిపి రమణా రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ పాలకమండలి సభ్యులు సూర్యనారాయణ, గోవింద్ రెడ్డి , రామచంద్ర, ఆలయ అర్చకులు ఆంజనేయదాస్, నాగరాజు, రెడ్డెప్ప సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

నల్లచెరువు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ బత్తలపల్లికి బదిలీపై వెళ్లిన దివాకర్ బాబును బుధవారం ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో శకుంతల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివాకర్ మండలానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులు, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని బీడుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో మండల విద్యాధికారి బొల్లే ప్రసాద్, గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం మొక్కలు నాటారు. ఇంటింటా చెట్టు ఊరంతా పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ నాయక్ ,సురేష్ గ్రీన్ భారత్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట రత్నం, గౌరవ సలహాదారులు ఆదినారాయణ ఉమెన్ వెల్ఫేర్ డైరెక్టర్ సుగుణ తదితరులు విద్యార్థులతో చెట్లను నాటించారు.

ఎంఇఒలతో సమీక్ష

కొత్తచెరువు : జిల్లాలోని అన్ని మండలాల ఎంఇఒలతో సమీక్ష సమావేశాన్ని డిఇఒ మీనాక్షి బుధవారం సాయంత్రం కొత్త చెరువులోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మనబడి నాడు నేడు, జెవికె బైజుస్, ప్రైవేటు స్కూళ్ల మానిటరింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు వీటి పైన పూర్తిగా అవగాహన పెంచుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రంగస్వామితో పాటు జిల్లాలోని ఆయా మండలాల ఎంఇఒలు పాల్గొన్నారు

9న జాతీయ లోక్ అదాలత్

కదిరి టౌన్ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 9 న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఎల్ తరబడి పెండింగ్ లో ఉన్న పరిష్కారం కానీ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ కాబడిన క్రిమినల్, సివిల్, బ్యాంకు,చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించు కోవాలని సూచించారు.

పురపాలక అభివృద్ధికి సహకరించండి

ధర్మవరం టౌన్ : పురపాలక ఆదాయానికి, పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, వైయస్సార్ కాలనీ, కేతిరెడ్డి కాలనీ, ఎర్రిస్వామి ఎల్సికేపురం, ఎల్-1, ఎల్-2, ఎల్-3, ఎల్-4 కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. ఇల్లు పట్టా పొంది, ఇల్లు కట్టుకొన్న వారు పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. పన్నుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పన్నులు కట్టకపోతే ఆదాయం, పట్టణ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆనంద్, సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చంద్రబాబు పర్యటనలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం పెనుకొండ పర్యటన ముగించుకుని గోరంట్ల మీదుగా ఓడిసికి సాయంత్రం చేరుకుంటారన్నారు. టిడిపి తెలుగు మహిళలు నాయకులు కార్యకర్తలు వివిధ వర్గాల వారు పాల్గొనాలని కోరారు. ఇదిలా ఉండగా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ గ్రామాల్లో పర్యటించి యువతకు, అన్ని వర్గాల ప్రజలకు చంద్రబాబు పర్యటన ఉద్దేశ్యాన్ని ను వివరిస్తూ పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

తనకల్లు : ఈనెల 3న చేపట్టనున్న చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ బుధవారం పరిశీలించారు. 3వ తేదీ రాత్రి చంద్రబాబు నాయుడు మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ వద్ద గల పోలం సిద్ధారెడ్డి ఫంక్షన్ హాల్ విడది చేయనున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు విడిది ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : సాగునీటి ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వ విధానాన్ని ఎండగొడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా నేడు కదిరి పట్టణానికి వస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కోనేరు, టవర్ క్లాక్ ,కాలేజ్ సర్కిల్, మీదగా ఇందిరాగాంధీ సర్కిల్ వరకు రోడ్ షో అనంతరం అక్కడే బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో కదిరి రూరల్ మండలం ముత్యాల చెరువు సమీపాన జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

తలుపుల : చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలసి టిడిపి స్థానిక నాయకులు కోరారు. గురువారం కదిరికి వస్తున్న సందర్భంగా తెలుగుదేశం కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున కదిరికి తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దుల రాముడు, పండు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబుతో కలసి పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి. మడకశిర

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాజెక్టులు పరిశీలనలో భాగంగా బుధవారం నంద్యాల జిల్లాలో జరిగిన పలు ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడుతో కలసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పరిశీలించారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ పనులను పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో చేపట్టిన పనులు అలాగే మిగిలిపోయాయని తాము కోట్లాది రూపాయలు ఖర్చు పెడితే జగన్మోహన్ రెడ్డి పైసా ఖర్చు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు పంటలకు నీరునివ్వడానికి కషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సాకేభారతికి ఆత్మీయట్రస్ట్ చేయూత

ప్రజాశక్తి - ధర్మవరంటౌన్

ఒకపక్క కూలిపని చేస్తూ ఎస్కేయూనివర్సిటిలో కెమిస్ట్రీలో పీహెచ్ డీ పూర్తీ చేసిన సాకే భారతికి ఆత్మీయట్రస్టు చేయూత నందించింది. ధర్మవరంపట్టణానికి చెందిన ఆత్మీయట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి అనంతపురం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్లో సాకేభారతికి రూ.65 వేలు చెక్కును అందజేశారు. ట్రస్టు డైరెక్టర్ పరమేశ్వరరెడ్డి, నంగీ, టెక్సాస్, యుఎస్ఎ మిత్రబృందానికి ఈసందర్భంగా భారతి ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ట్రస్టువైస్ చైర్మన్ శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, సభ్యులు రంజిత కుమార్, స్థానిక యూటీఎఫ్ నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సాకే భారతికి చెక్కును అందజేస్తున్న ఆత్మీయట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తదితరులు

'సంపూర్ణ పోషణ'తో తల్లీబిడ్డకు ఆరోగ్యం



చిలమత్తూరులో కిట్లను పంపిణీ చేస్తున్న దీపిక



గుడిబండలో కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - చిలమత్తూరు

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైసిపి హిందూపురం నియోజకవర్గ ఇంచార్జ్ దీపిక అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్బీకేలో నిర్వహించిన టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని దీపక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, ఎంపిడిఒ నరేంద్ర క్రిష్ణ, సర్పంచి సంధ్య, తిరుమలేష్, మురళీ, ఎంపిటీసి రాఘవేంద్ర నాయకులు రామక్రిష్ణా రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : స్థానిక పూలకుంటలోని ఐసిడిఎస్ కార్యాలయంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక పంపిణీ చేశారు. అదేవిధంగా తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, ఎంపీడీఓ నరేష్, సిడిపిఒ రెడ్డి రమణమ్మ, చిన్నపిల్లల డాక్టర్ కేశవులు, సివిల్ సప్లై డీటీ హారతి, నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, సిపిసి సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని పెద్దకోడిపల్లి, తురకలాపట్నం గ్రామాలోలని అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులకు, బాలింతలకు ఇంటికే రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రొద్దం సర్పంచు రూప, తహశీల్దార్ ఆనంతాచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లలో బుధవారం వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, ఉప సర్పంచి వేణుగోపాల్, ఎంపీటీసీ ఈశ్వరయ్య, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోఆర్డీ నాగరాజు రావ్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. బుధవారం స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం. ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు ఎంపీడీఓ కార్యాలయ సూపరెండెంట్ శ్రీదేవి, సీహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సంపూర్ణ పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు. చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి తెలిపారు కొత్త చెరువులోనే నామగుండ్ల వీధిలో గల అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆమె పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాధా, జెడ్పీటీసీ గంగాదేవి, సిడిపిఒ గాయత్రి, సూపర్వైజర్ పుష్పలత, అంగన్వాడీ టీచర్లు రాధా, ఉమాదేవి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పరిగి : రక్తహీనత పోషకాహారం లోపం లేని పిల్లల ఎదుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి వెల్లడించారు.బుధవారం పరిగి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప రెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్, ఎంపిటిసి లింగమ్మ, సూపర్వైజర్ సుశీలమ్మ, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని చామాలగొంది, సోమయాజులపల్లి, మల్ల మీద పల్లి, కోటూరు. తదితర గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లలో గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సరస్వతి, కార్యకర్తలు లక్ష్మీదేవి, ఈశ్వరమ్మ, మండల ఆర్బికే చైర్మన్ వైవి శంకర నాయుడు, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

బత్తలపల్లి : స్థానిక ఐసీడీఎస్. కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సీడీపీవో సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అంతకు ముందు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పద్మావతి, సూపర్ వైజర్లు చంద్రమ్మ, దేవమణి, లలితమ్మ, రోఆర్డినేటర్ ములమ్మ, అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరువు : మండల కేంద్రంలోని1,వ సచివాలయం పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఎంపిపి రమణారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శకుంతల, తహశీల్దార్ రవికుమార్ చేతుల మీదుగా గర్భిణులకు పోషకాహారకిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బందితో పాటు వైస్ ఎంపీపీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : బాలింతలకు, గర్భిణీలకు నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే పౌష్టిక ఆహారం అనే పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రాళ్లపల్లి సర్పంచి లక్ష్మీనారాయణ సూచించారు. మండల పరిధిలోని కల్లురొప్పం గ్రామంలోనిఅంగన్వాడి 1 ,2, వ సెంటర్లలో బుధవారం తల్లి పాల వారోత్సవాలతోపాటు నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే పౌష్టిక ఆహారం పథకం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ద్రాక్షాయని, రాధిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, డీలర్ తిమ్మా గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులకు, బాలింతలకు పాలు కోడిగుడ్లు రైసు నూనె పంపిణీ చేశారు ఈ సందర్భంగా డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో సర్పంచి సరోజ, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, మండల అగ్రిచైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్ నాగరాణి పంచాయతీ ఈవో బాబురావు తదితరులు పాల్గొన్నారు

రొళ్ల : మండలంలోని వెలుగు కార్యాలయం నందు బుధవారం అంగన్వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు కూరగాయల ప్రదర్శన చేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సన్నమ్మ, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, సర్పంచి రామలక్ష్మమ్మ, వెలుగు ఎపిఎం, మహిళా పోలీసులు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.